'రాజీవ్ యువవికాస్'పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కంఠేశ్వర్, మార్చి 31 : రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న రాజీవ్ యువ వికాస్ పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచలు చేశారు. ఈ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా రాయితీ కోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్లను వెచ్చించాలని సంకల్పించినట్లు వెల్లడించారు. పథకం అమలు తీరుపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, డీబీసీడీవో స్రవంతి, డీటీడబ్ల్యూవో నాగూరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్ పాల్గొన్నారు.

వడ్లను ఏ రైస్‌మిల్లుకు కేటాయించారో బహిర్గతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

ఖలీల్‌వాడి, మార్చి 31 : కోటగిరి సహకార సంఘం ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లను ఏ రైస్‌మిల్లుకు కేటాయించారు, ధాన్యం, ట్రక్ షీట్ల వివరాలను అధికారులు బహిర్గతపర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం సీజన్‌కు సంబంధించి కొనుగోలు చేసిన వడ్లకు రైతులకు బోనస్ కేటాయించాల్సి ఉండగా, వారి పేర్లను మార్చి వ్యక్తిగతంగా కొద్దిమంది ఖాతాలో వేసుకున్నారని అన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు కూచి సిద్ధును వెంటనే సస్పెండ్ చేసి, బోనస్ డబ్బులు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పాలని, ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు హన్మాండ్లు, సురేశ్, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

నగరంలోని ఈద్గా వద్ద ముస్లింల సందడి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 31 : జిల్లావ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. నూతన దుస్తులు ధరించి చిన్నా పెద్ద తేడా లేకుండా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం గతించిన వారి కుటుంబీకుల సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రంజాన్ పండగను పురస్కరించుకుని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి భీమ్‌గల్, బడాభీమ్‌గల్ దర్గాల వద్ద రంజాన్ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ముస్లిం పెద్దలు, చిన్నారులు, యువకులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నగర శివారులోని సారంగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ఎండీ అక్బర్ నవాజుద్దీన్ తన ఇంట్లో ఏర్పాటు చేసిన విందులో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి.. కుటుంబీకులతో కలిసి హాజరయ్యారు. స్థానిక మైనార్టీలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కోటగిరిలో మైనార్టీ నాయకుడు జుబేర్ ఏర్పాటు చేసిన విందుకు ఉమ్మడి డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. బోధన్‌లోని నర్సిరోడ్డు ఈద్గాకు ముస్లింలు తరలివచ్చి ప్రార్థనలు చేశారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలనే యోచనకు వ్యతిరేకంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, ముస్లింలు సోమవారం నిరసన తెలిపారు. రంజాన్ ప్రార్థనల అనంతరం ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ముస్లింలు పాల్గొన్నారు. బోధన్, ఏర్గట్ల ఈద్గాల్లో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు తమ చేతులకు నల్ల రిబ్బన్‌లు కట్టుకుని కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ముస్లింలు

బందోబస్తును పర్యవేక్షించిన సీపీ

వినాయక్‌నగర్, మార్చి 31 : రంజాన్ పండుగ సందర్భంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును సీపీ సాయి చైతన్య సోమవారం పర్యవేక్షించారు. నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలోని శాంతినగర్ ఈద్గా వద్ద బందోబస్తు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కచ్చియా మసీదు వద్ద, శంభుని ఆలయం వద్ద పికెట్, ట్రాఫిక్ డైవర్షన్‌ను పరిశీలించారు. సీపీ వెంట అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు. బోధన్‌లో పోలీసు బందోబస్తును సీపీ సాయి చైతన్య పర్యవేక్షించారు. సీపీ వెంట అదనపు పోలీస్ కమిషనర్ బస్వారెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, పోలీసు అధికారులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య

ఖలీల్‌వాడి, మార్చి 31 : జిల్లాలో 15 రోజులుగా రైతులు వరి పంట కోతలు ప్రారంభించారని, కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. నగరంలోని అర్సపల్లి గ్రామంలో గౌరవ అధ్యక్షుడు నాయక్‌వాడి నర్సయ్యతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులు దళారులకు విక్రయిస్తున్నారని, వారు సంచికి రూ. 2 నుంచి రూ.5 వరకు తరుగు తీస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు అన్ని రకాల ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికుల అభిప్రాయ సేకరణ

అభిప్రాయాలు సేకరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

రుద్రూర్, మార్చి 31 : రుద్రూర్ బస్టాండ్ ప్రాంగణంలో బోధన్ డిపో మేనేజర్ విశ్వనాథ్ ఆదేశానుసారం ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఆర్టీసీ బస్సులు సమయానికి వస్తున్నాయా, సరిపడా బస్సులు ఉన్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో క్లర్క్ శంకర్, సాయేందర్, కంట్రోలర్ మధుకర్ పాల్గొన్నారు.

కుమార శర్మకు ఉగాది పురస్కారం

కుమారశర్మను సన్మానిస్తున్న తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు

సుభాష్‌నగర్, మార్చి 31 : ప్రముఖ నాటక ప్రయోక్త శ్రీపాద కుమార శర్మకు తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు సోమవారం ఉగాది పురస్కారాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో ఉగాది పురస్కారం అందజేసి అభినందించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు, కవి చందన్‌రావు మాట్లాడుతూ.. నాలుగు సినిమాలు, వందకు పైగా నాటికలు, 50కి పైగా ఉత్తమ పురస్కారాలు అందుకొని ఇందూరు నాటక రంగ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన కుమారశర్మను కొనియాడారు.

ప్రజల అభ్యున్నతిని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

మైనార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

సారంగాపూర్, మార్చి 31 : ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ప్రభుత్వం ప్రజల అభ్యున్నతిని విస్మరిస్తున్నదని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రంజాన్ సందర్భంగా సారంగాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద మైనార్టీ నాయకులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద ముస్లింలకు తోఫాలు అందించడంతోపాటు ఆత్మీయ అతిథ్య కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిందని, మంత్రులు ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రాక్షస పాలన అందిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కలిసికట్టుగా ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, నాయకులు అక్బర్, అఫ్సర్, స్వామి, రాజు, రజాక్, నయీం, సారంగాపూర్, రాంనగర్ మైనార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మామిడ్ల సాయిరెడ్డిని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గాదారి సంజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ బోర్గాం(పీ) గ్రామ శాఖ అధ్యక్షుడు ఈగ నర్సారెడ్డి పాల్గొన్నారు.
– సారంగాపూర్, మార్చి 31

దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి, మార్చి 31 : మండలంలోని మునిపల్లి గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులు ఏప్రిల్ 2న ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమో తరగతులకు హాజరుకావాలని సూచించారు. నెట్ / సెట్, పీహెచ్‌డీ ఉన్న ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'విద్యార్థులపై దాడి సిగ్గుచేటు'

విలేకరులతో మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ

ఇందల్వాయి(డిచ్‌పల్లి), మార్చి 31 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడిచేయడం సిగ్గుచేటని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ అన్నారు. టీయూ శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. హెచ్‌సీయూకి చెందిన భూమిని పొక్లెయిన్‌తో చదును చేయడాన్ని నిరసిస్తూ తెలిపిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం లాఠీచార్జి చేయించడం దారుణమన్నారు. ప్రశ్నిస్తే తప్పు అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏబీవీపీ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షులు తరుణ్, సమీర్, నాయకులు రాము, అశోక్, శివ పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ పద్ధతిని అలవర్చుకోవాలి

ఉద్యానవన శాఖ మాజీ సంచాలకుడు వెంకటరామిరెడ్డి సూచన

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

కంఠేశ్వర్, మార్చి 31 : రైతులు సేంద్రియ సహజ వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయాలని మాజీ ఉద్యానవనశాఖ సంచాలకుడు వెంకటరామిరెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో సహజ వ్యవసాయ ప్రాంతీయ కేంద్రం –నాగ్‌పూర్ వారు ఒకరోజు సేంద్రియ సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణ తీసుకున్న రైతులు సేంద్రియ సహజ వ్యవసాయ పద్ధతిని అవలంబించాలని సూచించారు. త్వరలో ఏర్పాటయ్యే జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లో రైతులు సభ్యత్వం తీసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ప్రవీణ్ మాట్లాడుతూ సేంద్రియ సాగుతో కలిగే ప్రయోజనాలు, రైతులకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారులు సాయిబాబా, నర్సయ్య, రోహిత్, వినాయక్, జిల్లాలోని వివిధ ఎఫ్‌పీవో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీపోటీలు

కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

కోటగిరి, మార్చి 31 : మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో ఉగాది పురస్కరించుకొని సోమవారం కుస్తీపోటీలు నిర్వహించారు. మహారాష్ట్రతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఈర్వంత్‌రావుపటేల్, గంగుపటేల్, సంజీవ్‌పటేల్, నీరడి మధుకర్, శంకర్, గంగాధర్, లక్ష్మణ్, నవీన్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆలయంలో వేముల పూజలు

మోతె ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్, మార్చి 31: మండలంలోని మోతె రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామి దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు పనులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలను మంత్రి మంజూరు చేయించారు. ఈ పనులు ఇటీవల పూర్తి కావడంతో ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

సాలూరా సొసైటీ మహాజనసభ తీర్మానం

బోధన్, మార్చి 31: సాలూరా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఇంకా పూర్తిగా రుణమాఫీకాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతుల రుణమాఫీ విషయం ప్రభుత్వం పరిశీలించాలని కోరతూ సోమవారం ఆ సొసైటీ మహాజనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. సాలూర మండల కేంద్రంలోని ఆ సొసైటీ ప్రాంగణంలో నిర్వహించిన ఈ మహాజనసభకు సొసైటీ అధ్యక్షుడు అల్లె జనార్దన్ అధ్యక్షత వహించారు. సభలో సొసైటీ అర్ధ వార్షిక నివేదికను, 2023–24 ఆడిట్ నివేదికను సంఘం సీఈవో బి.బస్వంత్ రావు ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. వరి, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానం చేశారు. సభలో సొసైటీ డైరెక్టర్లు ముట్టెన్ గంగారాం, డి.సందీప్‌రెడ్డి, దేవేందర్ పటేల్, శివకాంత్ పటేల్, సంగెపు భూమన్న, బచ్చు సాయిలు, గంటె హొట్లప్ప, ఏఎంసీ డైరెక్టర్ సంగెపు భూమన్న, శివాలయం చైర్మన్ లోక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు అల్లె జనార్దన్

మహనీయుల జయంతిని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న నీరడి ఈశ్వర్

బోధన్, మార్చి 31: ఏటా నిర్వహించిన మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మహనీయుల జయంతిని బోధన్ పట్టణంలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు నీరడి ఈశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 30న నిర్వహించనున్న సభను విజయవంతం చేసేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కమిటీ కో–కన్వీనర్లు సింగాడే పాండు, నీరడి రవి, దేవేందర్, కోశాధికారి శ్రావణ్‌కుమార్, సలహాదారులు కొండ్ర వెంకటి, వివిధ మండలాల అధ్యక్షులు దాసరి శ్యామ్, బెండ రాజు, రాహుల్, విఠల్, భీమ్‌రావు, సాగర్, గౌతమ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో నిజామాబాద్ విద్యార్థి ఆత్మహత్య

రాహుల్ చైతన్య (ఫైల్)

వర్ని, మార్చి 31: ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో ఉన్న ట్రిపుల్ ఐటీ హాస్టల్‌లో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ దివ్యాంగ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం కలకల రేపింది. ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్న మాదాల రాహుల్ చైతన్య అనే విద్యార్థి హాస్టల్ భవనం ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రానికి చెందిన మాదాల కృష్ణప్రసాద్, స్వర్ణలత దంపతుల పెద్ద కుమారుడైన మాదాల రాహుల్ చైతన్య ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్‌లో ఉన్న ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి కళాశాల హాస్టల్ భవనం ఐదో అంతస్తు భవనం నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని బయటికి పొక్కకుండా కొందరు అధికారులు రహస్యంగా ఉంచడంతో స్థానికులు అక్కడి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. సదరు పోస్టు వైరల్ కావడంతో గమనించిన అధికారులు వెంటనే పోలీసులతోపాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రాహుల్ చైతన్య తల్లిదండ్రులు ఆదివారం అలహాబాద్‌కు బయల్దేరారు. రాహుల్ చైతన్య ఆత్మహత్యకు కారణాలను ఏంటని అధికారులను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆత్మహత్యకు కారణాలు తెలియడంలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రాహుల్‌చైతన్య చదువులో ముందుండడంతోపాటు ఇటీవల ఈడబ్ల్యూఎస్‌లో ఆలిండియాలో 52వ ర్యాంకు వచ్చిందని స్థానికులు, కుటుంబీకులు తెలిపారు. మృతుడికి అభిరామ్ అనే సోదరుడు ఉన్నాడు. రాహుల్ చైతన్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ చైతన్య మృతితో వర్ని మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భీమ్‌గల్ విశ్వకర్మ కార్యవర్గం

మోర్తాడ్, మార్చి31: భీమ్‌గల్‌లో సోమవారం విశ్వకర్మ–2 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందం భూమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా కత్రజీ బుచ్చన్న, కోశాధికారిగా రాగుల గంగాధర్, కోలకాడుగా ఘనపూర్ నరేందర్, సలహాదారులుగా గజ్జల మోహన్, రాగుల ఓంకార్, జమిలి గిరి ముత్తెన్న, రావుట్ల సతీశ్, కోటగిరి హరిని ఎన్నుకున్నారు. నూతన కమిటీని సంఘ సభ్యులు అభినందించారు.

ముదిరాజ్ సంఘం..

ఆర్మూర్‌టౌన్,మార్చి31: పట్టణంలోని మామిడిపల్లి ముదిరాజ్ సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పడాల నరేశ్, కార్యదర్శిగా పిప్పెర వంశీ ఎన్నికయ్యారు. ముదిరాజ్ సంఘం సభ్యులు వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాలు

ఆర్మూర్‌టౌన్, మార్చి31: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. కానీ దుకాణదారులు ఫుట్‌పాత్‌లపై అక్రమంగా కోకాలు నిర్మించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా ఫుట్‌పాత్‌లపై వెలిసిన అక్రమ కట్టడాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై నిర్మించుకున్న అక్రమ కట్టడాలు

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I KOTHURU SURESH(OLD NAME) S/O KOTHURU BAJANNA,CHENGE MY NEW NAME AS KOTHUR SURESH S/O KOTHURU BAJANNA ,H NO: 5-124/1, BLOCK NO 3 ALOOR,ARMOOR, NIZAMABAD.
NTZ -338575

CHANGE OF NAME
★ I KOTHURU RAJAMANI (OLD NAME) W/O KOTHURU SURESH, CHENGE MY NEW NAME AS KOTHUR CHINNU BAI W/O KOTHUR SURESH, H NO: 5-124/1, BLOCK NO 3 ALOOR ARMOOR NIZAMABAD.
NTZ - 338575

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

శక్కర్‌నగర్, మార్చి 31: సాలూరా మండల కేంద్రానికి చెందిన ఫాతిమాబేగంకు సోమవారం మధ్యాహ్నం 108 సిబ్బంది ప్రసవం చేశారు. సాలూరాకు చెందిన గర్భిణి ఫాతిమాబేగంకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్సులో ఆమెను బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని నిజామాబాద్ జిల్లా దవాఖానకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. 108 వాహనంలో నిజామాబాద్‌కు తరలిస్తుండగా బోధన్ పట్టణ శివారులో ఆమెకు పురిటి నొప్పులు అధికం అయ్యాయి. వైద్యుడు జగదీశ్ సలహా మేరకు 108 టెక్నీషియన్ లక్ష్మణ్, పైలట్ నరేశ్ గర్భిణీకి అంబులెన్స్‌లోనే ప్రసవం జరిపించారు. రెండో కాన్పులో ఫాతిమా బేగం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, కూతురును నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. అంబులెన్స్‌లో సుఖ ప్రసవం జరిపించిన 108సిబ్బందిని మహిళ కుటుంబీకులు అభినందించారు.



108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం కాగా బిడ్డను అప్పగిస్తున్న సిబ్బంది

'నిరసన తెలిపితే అరెస్టులా..'

ఆర్మూర్‌టౌన్, మార్చి31: శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టు చేయడం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్ అన్నారు. పట్టణంలోని ఆసంఘ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీలు, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడమే రేవంత్ రెడ్డి సర్కారు ధ్యేయంగా కనిపిస్తున్నదని మండిపడ్డారు. ఎందరో మంది విద్యార్థి మేధావులకు జీవితాన్ని ఇచ్చిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దాదాపు 1500 ఎకరాలకు పైగా విస్తరించి ఉండగా ఇప్పుడు అందులోని 400 ఎకరాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ అమ్మకాలను నిరసిస్తూ కొన్ని రోజులుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు శాంతియుతంగా ఆందోళన చేపట్టగా వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. సమావేశంలో ఆసంఘం నాయకులు మమత, సిద్ధు, సచిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి..

బోధన్ రూరల్, మార్చి 28: బోధన్ మండలం పెగడపల్లి శివారులో గతనెల 29న గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గతనెల 29న గుర్తు తెలియని వ్యక్తి పెగడపల్లి నుంచి బోధన్ వైపు వస్తున్నాడు. బోధన్ మండలం బర్దిపూర్‌కు చెందిన విజయ్ సాటాపూర్ నుంచి బర్దిపూర్‌కు బైక్‌పై వస్తూ వెనుక నుంచి ఢీ కొట్టాడు. స్థానికులు గమనించి దవాఖానకు తరలించారు. దీంతో ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. లంగ్డాపూర్ కారోబార్ వీరేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళ తప్పిన పల్లె ప్రకృతి వనం

అమ్దాపూర్ పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన చెట్లు

బోధన్ రూరల్, మార్చి 31: మొన్నటి వరకూ పచ్చని వనంతో ఆహ్లాదం పంచిన పల్లె ప్రకృతి వనాలు ఇప్పుడు అధ్వానంగా మారాయి. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సర్కార్ హయాంలో హరితహారంలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వివిధ రకాల పూల, పండ్ల మొక్కలు పెంచడమే కాకుండా పిల్లలు, పెద్దలు సాయంత్రం పూట ఉల్లాసంగా గడిపేందుకు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. అయితే కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన తర్వాత అధికారులు పల్లెప్రకృతి వనాల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయి. బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లను కొందరు నరికివేశారు. పల్లె ప్రకృతి వనం చెత్తాచెదారంతో నిండిపోయింది. బోధన్ మండలంలోని అన్ని గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాల పరిస్థితి ఇలాగే ఉంది. ప్రత్యేక అధికారుల పాలన కారణంగా పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి.. కేసు నమోదు

ఎడపల్లి, మార్చి 31:బోధన్ ఆర్టీసీ డిపోనకు చెందిన డ్రైవర్, కండక్టర్‌పై సోమవారం దాడి జరిగింది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్తున్నది. ఈ క్రమంలో దూపల్లి గేట్ వద్ద బస్సును ఆపి సల్మాన్, ముఖీద్ అనే వ్యక్తులు బస్సులో ఉన్న డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేశారు. డ్రైవర్ శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

బోధన్ రూరల్, మార్చి 31: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సాలూర మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. సాలూరా గ్రామానికి చెందిన కుమ్మరి నగేశ్ (38) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. అప్పులు పెరిగిపోవడంతో ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. దీంతో భార్య కుమ్మరి జ్యోతి గ్రామంలో వేరే ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నది. నరేశ్ జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లడంతో..

తన భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురై బోధన్ మండలంలోని ఊట్‌పల్లికి చెందిన ఒకరు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. ఊట్‌పల్లి గ్రామానికి చెందిన జడల రఘుపతి (45) మూడేండ్ల క్రితం తన తండ్రిని హత్య చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. తరుచూ భార్యతో గొడవపడుతున్నాడు. దీంతో భార్య అనిత రెండు నెలల క్రితం తన తల్లిగారింటికి వెళ్లింది. మద్యానికి బానిసైన రఘుపతి ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.